# మినీ కథ

# స్వామీ!

"నేనూ అయ్యప్ప స్వామి మాల ధరిస్తామనుకుంటున్నాను... భోజనం చేస్తూ చెప్పాడు జయరాం.

"మీరా!" ఆశ్చర్యపోతూ అంది సుజాత.

"అవును. ఏం..,?" వెంటనే ప్రశ్నించాడు జయరాం.

"అబ్బే! ఏంలేదు. ఇంట్లో కష్టం అనుకుంటాను..." సర్దుకుంటూ అంది సుజాత.

"ఇంట్లో వీలుపడదులే. అందుకనే మేమంతా గుడికి దగ్గరగా ఓరూమ్ తీసుకొని అందులో ఉంటూ పూజలు, భజనలు చేసుకుంటాం. అటునుండే ఆఫీసుకు వెడతాను .."అని చెప్పాడు జయరాం చేయి కడుక్కుంటూ.

"వస్తాను మరి. ఆఫీసుకు టైమయింది." చెప్పులు వేసుకొని తలుపు దగ్గరకు లాక్కొని వెళ్ళిపోయాడు. సుజాత ఇంకా ఆశ్చర్యం నుండి తేరుకోలేదు- ఈయన ఈయనగారి ఫ్రెండ్స్ కలిసి అయ్యప్ప స్వామి మాల వేసుకొని శబరిమలై పోవటమా? నియమ నిష్ఠలతో 40 రోజులు గడుపుతారా? ఓ ప్రక్క ఆనందం, లేని పోనివి నెత్తిమీదకు తేరుకదా! ఆ స్వామికి కోపం తెప్పించరు కదా! అన్నది మరో భయం.

సుజాత భయానికి కారణం... జయరాం మంచి ఉద్యోగంలో వున్నాడు. అందమైన భార్య. ముత్యాల్లాంటి ఇద్దరి పిల్లలతో చక్కటి సంసారం. అయితే అతనికో బలహీనత ఉంది! అది పార్టీలు అవీ జరిగినపుడు వద్దనకుండా మందుకొట్టడం! పార్టీలని నెలకు ఒకటి, రెండుసార్లు త్రాగటం! ఏగోల చేయక, నల్గురికి తెలీక గుట్టుగా జరిగిపోతున్నా, సుజాత ఆందోళన ఈ చిన్న అలవాటే క్రమంగా వ్యసనంగా మారి మా సంసారం బయటపడదు కదా అని! అలాఅని జయరాంతో గట్టిగా వారించలేదు. ఏ కొరతాలేక ప్రేమగా చూసే భర్తను ఏభార్య మాత్రం ఏమంటుంది. ఆకారణంగానే సుజాతకు జయరాం శబరిమలై పోతున్నాడంటే ఆశ్చర్యం వేసింది.

"ఏమిటమ్మా! సుజాత ఏమిటో ఆలోచిస్తున్నావు..." పక్కింటి పిన్నిగారు లోపలికి రావటంతో ఆలోచనలనుండి తేరుకుని "ఏంలేదు రండి...." అంది.

"అబ్బాయి వచ్చి భోజనం చేసాడా..?" కూర్చుంటూ అడిగారు పిన్నిగారు.

"ఆ... చేసి వెళ్ళాడు. మరేమో! పిన్నిగారూ! మీ అబ్బాయి ఆఫీసులో వాళ్ళు కొంతమంది అయ్యప్పస్వామి దగ్గరకు వెడతారట... అందుకని మాల వేసుకుంటారట.." చెప్పింది సుజాత ఆవిడకు.

"అలాగా! తల్లీ! ఎంత భాగ్యం చెప్పు. పోనీలేమ్మా! మంచిది. అయితే చాలా నిష్ఠగా ఉండాలమ్మా. ఇంటికి రాకుండా వుంటే సరి..."అని పోయినవారి సంగతులు చెప్పటం ప్రారంభించిందావిడ. వింటూ, మధ్యలో ఆలోచిస్తూ, చాలాసేపు గడిపేసింది సుజాత. "వస్తానమ్మా!" అంటూ వెళ్ళారు పిన్నిగారు.

* * *


"నేను ఇంటికి వచ్చినా ఇక్కడభోజనం చేయను. మేమంతా ఆ రూమ్‌లోనే వంట ఏర్పాటు చేసుకుంటున్నాం. రోజూ సాయంత్రం వచ్చి కనబడి పోతుంటాను. రాత్రిళ్ల భయం లేదు కదా?" అని అడిగాడు జయరాం.

లేదన్నట్లు తలూపింది సుజాత. "నీవు ఇంట్లోకి రాని సమయంలో నాకు బాబుచేత చెప్పి పంపు. జాగ్రత్త వస్తాను...."అంటూ వెళ్ళిపోయాడు జయరాం.

"పిన్నిగారూ! ఈమధ్య చాలామంది అయ్యప్ప భక్తుల్ని తమ యింటికి పిలిపించుకొని సమారాధనలు చేయించుకుంటున్నారట. మనం ఎటూ పోనివాళ్ళంకదా! నేనూ పిలిపిస్తాను. నాకుకొద్దిగా సహాయం చేయరూ... వారందరికి టిఫిన్‌లు అవీ, మేడపైన గది ఏర్పాటు చేయగలరా?..." అడిగింది ఆరోజు ప్రొద్దున సుజాత పిన్నిగార్ని.

"ఎంతటి పుణ్యం తల్లీ! తప్పక పిలిపించు. ఆ పూజలూ, పాటలూ వింటాం. నేను సహాయం చేస్తాను..." అందావిడ.

* * *



# నన్నాశీర్వదించండి!

ఆరోజు సాయంత్రమే జయరాం, వాళ్లు వచ్చేది. ఇల్లంతా కడిగించి ముగ్గులు వేసింది. పిల్లలకు తలకపోసి తనూ తలకు పోసుకుంది. కావలసిన వస్తువులన్నీ తెప్పించింది. అన్నీ సిద్ధంచేసింది... వీటన్నింటిలో పిన్నిగారి సహాయం ఉంది.

మరో గంటకు స్వాములందరూ వచ్చేశారు. పటాలు, వాటిమీద రకరకాల పూలు, దీపాలు అంటించి, పాటలు పాడుతుంటే ఆదేవుడు ఈక్షణమే ప్రత్యక్షమౌతాడా అనిపించేట్లుంది వినేవారికి! ఆ రెండుమూడు గంటలు మరోలోకం లేనట్లు తన్మయులను చేసారు ఆ అయ్యప్ప భక్తులు. ఎంతో భక్తిగా అందరికి టిఫిన్‌లు అవీ పెట్టి, అందరికి తృప్తి కలిగించానని ఆనందపడింది సుజాత సంతోషంగా.

* * *

నియమ నిష్ఠలతో, నిత్యం దేవుని దీపారాధనలతో గడిపిన జయరాం బృందం ఆరోజు సాయంత్రమే శబరిమలైకి ప్రత్యేకమైన బస్సులో బయలుదేరింది. ఎంతో మంది, అయ్యప్ప స్వామివారికి విరాళాలు ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు. అక్కడన్నీ ఏర్పాట్లు చేసుకొని, చెప్పటానికని ఇంటికి వచ్చాడు జయరాం.

జయరాం ఇంటికి వస్తే పిల్లలకు భలే సరదాగా ఉంటుంది. ఎప్పుడూ వినని, చూడని, విధంగా నాన్న వరండాలో కూర్చుని మాట్లాడటం- వారికి చాలా ఆశ్చర్యం! అంతకుమించి అమ్మ నాన్నని 'స్వామీ!' అని పిలవటం మరీ మరీ ఆశ్చర్యం.

"మరి మేము బయలుదేరుతున్నాం. సరేనా!" నవ్వుతూ తల పైకెత్తాడు జయరాం.

ఆ ముఖాన్ని అలాగే చూస్తూ వుండిపోయింది సుజాత. ఈ నలభై రోజులు మరో ఆలోచన లేకపోవటం, దేవుని పూజల్లో భక్తిగా, ప్రశాంతంగా ఉండటం ముఖానికి పెట్టిన బొట్టు.... ఏవిధంగా అయితేనేం అతని ముఖం ఏదో వింత కాంతితో మెరిసిపోతోంది. అలాగే తనని చూస్తూన్న భార్యనిచూసి దిగులు పడినట్లుంది- అని అనుకున్నాడతను.

ఎక్కువసేపు ఉంచటం దేనికి. టైమ్ కూడా లేదనుకొం[illegible] [illegible] పనులున్నాయి' అన్నాడు జయరాం.

"ఉండండి స్వామీ!" అంటూ లోపలికి వెళ్ళింది. వస్తున్న కన్నీటిని దిగమింగుకొని దేవుడిపటం ముందున్న కుంకుమ నుదుట, పాపిట్లో పెట్టుకొని పిల్లల్ని పిలిచింది "ఏమిటమ్మా" అంటూ వచ్చిన పిల్లలకు రెండు పూలమాలలు చెరొకటిచ్చి "నాన్న అదే స్వామిమెళ్ళోవేసి కాళ్ళకి దణ్ణం పెట్టండి" అని చెప్పింది సుజాత.

సంతోషంగా ఒకరివెనుక ఒకరు పూలమాలలు తీసుకొని వస్తున్న పిల్లల్ని ఆశ్చర్యంగా చూశాడు జయరాం. తన మెళ్ళో వేసి కాళ్ళకు దణ్ణం పెడుతున్న పిల్లల్ని చూసి, అతనికళ్ళు చెమ్మగిల్లాయి. తన్మయత్వంతో వాళ్ళను దగ్గరకు లాక్కొని ముద్దుపెట్టుకొని మనసులో అలవాటు ప్రకారం- "మే గాడ్ బ్లెస్ యూ మై చిల్డ్రన్" అనుకున్నాడు. "అమ్మేది" అడిగాడు పిల్లల్ని. అంతలో బయటకువచ్చింది సుజాత. ఆమెవైపు చూసాడతను. ఏడ్చినట్లనిపించింది. ఏం చేయాలో, ఎలా ఓదార్చాలో అర్థం కాలేద అతనికి. గబగబ అతని దగ్గరకు వచ్చి చేయి ముందుకు చాపింది అప్రయత్నంగా అతనూ చేయి ముందుకు చాపాడు. అక్షింతలు చేతిలో పెట్టి, అతని కాళ్ళమీదకు వంగింది- "ఏమిటీ:...." అయోమయంగా ఉంది జయరాంకి.

"స్వామీ! నన్నాశీర్వదించండి! మావారు చాలా మంచివారు. మమ్మల్ని చాలా బాగా చూసుకుంటారు. కాని అతనప్పుడప్పుడు త్రాగుతుంటారు. నాకిష్టంలేదు. ఆ చిన్న అలవాటు క్రమంగా పెద్దదయి మా సంసారం పాడవుతుందని నా భయం. అందుకని అయ్యప్పమాల వేసుకున్న ఓ స్వామీ! మీరు ప్రస్తుతం దేవుడితో సమానం కనుక మావారికి ఈ అలవాటు ఇంతటితో ఆగిపోతుందని, నన్ను భయపడవద్దని ఆశీర్వదించండి. శబరిమలైలో అంతదూరంగా ఉన్న మీకోసం వస్తున్న మావారిని దీవించి పంపండి. ఈ అలవాటు ఇంతటితో మానితే, మావారు మారితే, వచ్చే సంవత్సరం నేను మరలా ఆయన్ని మీ దగ్గరకు పంపుతాను... నన్నాశీర్వదించండి..." కన్నీళ్ళతో అడుగుతున్న సుజాతను ఓ క్షణం సూటిగాచూసి, అక్షింతలు ఆమెమీద చల్లి, తలమీద చేయి ఆనించి వెళ్ళిపోయాడు జయరాం. మరి ఆదేవుడు ఏమని ఆశీర్వదించాడో. తిరిగి వచ్చిన తరువాత 'ఆ' దేవుణ్ణే అడగాలి సుజాత.



# వడ్డెపల్లి పదాలు

కమండలం చేపట్టి
కన్యా మేనకను పట్టి
'బ్రహ్మర్షి' అయ్యాడు
విశ్వామిత్రుడు నాడు!

మండలములనే పెట్టి
మహర్షి వేషం గట్టి
రాజకీయ రాజర్షి
విశ్వామిత్రుడౌను నేడు!



*

జంటలెన్నో నేడు 'లాస్ట్‌షో' సినిమాకు
జల్సాగ వెళ్ళేరు మనసా!
ఒంటరిగ చిక్కితే వెంటపడి వేధించేటి
'లారీల' కాలమ్ము తెలుసా!

*